సంతాయిపేటలో అధ్యాపకుల ప్రచారం



నవతెలంగాణ-తాడ్వాయి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ఆదివారం అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలోనే చదివించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలలో మంచి విద్యాబోధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

సోమవారం 29 మే 2023

రెంజల్‌లో పెద్దమ్మ తల్లి బోనాలు



నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో పెద్దమ్మ తల్లి 11 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బోనాల ఊరేగింపు నిర్వహించినట్లు సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పెద్దమ్మతల్లి ఆలయానికి మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివెళ్లారు.

'పోడు' హక్కుదారుల గుర్తింపు పూర్తి

- 24వ తేదీ నుంచి పట్టాలు అందజేత
- ఫలించిన సీపీఐ(ఎం), గిరిజన సంఘం పోరాటం
- దశాబ్దాలుగా గిరిజనులు ఎదురుచూపులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

దశాబ్దాలుగా పోడు భూముల హక్కుల కోసం ఎదురుచూస్తున్న గిరిజనులకు కల సాకారం కానుంది. జూన్ 24వ తేదీ నుంచి పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీపీఐ(ఎం)తో పాటు గిరిజన సంఘం పలు దఫాలుగా చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఉద్యమాలతో ఎట్టకేలకు సర్కారు పోడు హక్కుల పంపిణీకి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యింది. ఇప్పటికే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో అర్హులను గుర్తించింది. నిజామాబాద్‌లో మొత్తం 3654 మందికి 7,485 ఎకరాలకు పోడు హక్కు పట్టాలు దక్కనున్నాయి. ఇక కామారెడ్డిలో 4,480 మంది రైతులకు 12,969 ఎకరాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోడు హక్కుల కోసం 41,278 దరఖాస్తులు రాగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పలు దఫాలుగా పరిశీలన చేసిన తరువాత అర్హులను గుర్తించారు. పోడు హక్కు పత్రాలు ఇవ్వడంతో పాటు రైతుబంధు కూడా అమలు చేయాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది.

పోడు భూముల కోసం గిరిజన సంఘాలు, సీపీఐ(ఎం) నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఫలితంగా అటవీభూమిపై ఆధారపడి ఉపాధి పొందుతున్న గిరిజనులకు పట్టాలు పంపిణీ చేసేందుకు సర్కారు సంసిద్ధత ప్రకటించింది. అందుకోసం ఆవాసాల వారిగా ఫారెస్ట్ రైట్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. నిజామాబాద్‌లో 195, కామారెడ్డిలో 394 కమిటీలను ఏర్పాటు చేశారు. గతేడాది నవంబర్ 8వ తేదీ నుంచి దరఖాస్తులను గిరిజనులతో పాటు గిరిజనేతరుల నుంచి కూడా దరఖాస్తులు వెల్లువెత్తాయి. పోడు సమస్య నిజామాబాద్ జిల్లాతో పొల్చితే కామారెడ్డి జిల్లాలో ఎక్కువగా ఉంది. కామారెడ్డి జిల్లాలో 268 ఆవాసాల్లో పోడు సమస్య ఉంటే.. నిజామాబాద్‌లో 195 ఆవాసాల్లో ఈ సమస్య నెలకొంది. కామారెడ్డి జిల్లాలో పోడు భూముల హక్కు పత్రాల కోసం మొత్తం 27,221 క్లయిమ్స్ వచ్చాయి. ఇందులో ఎస్టీలకు సంబంధించి 30,224 ఎకరాల కోసం 11,212 దరఖాస్తులు వచ్చాయి. ఇతర సామాజిక తరగతుల నుంచి 38,236 ఎకరాల కోసం 15,989 క్లయిమ్స్ స్వీకరించారు. మొత్తం 68,461 ఎకరాల్లో పోడు వ్యవసాయం కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ క్లయిమ్స్ అన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. నిజామాబాద్‌లో మొత్తం 195 ఆవాసాల్లో 14,057 క్లయిమ్స్ వచ్చాయి. ఇందులో ఎస్టీలకు సంబంధించి 8,535 దరఖాస్తులను స్వీకరించారు. ఎఫ్‌ఆర్‌ఓ చట్టం ప్రకారం ఈ దరఖాస్తుల పరిశీలన ఎఫ్‌ఆర్‌సీ కమిటీలు చేపట్టాయి. ఆ తరువాత మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారుల వరకు పరిశీలన చేపట్టారు. చివరగా నిజామాబాద్ జిల్లాలో 3654 మంది, కామారెడ్డి జిల్లాలో 4,480 మందిని అర్హులుగా గుర్తించారు.



(ఫైల్)

పోడు హక్కు పత్రాలకు పంపిణీకి రంగం సిద్ధమయ్యింది. ఇప్పటికే అర్హులు పేర పట్టాలు సిద్ధమైనట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ దశాబ్ది ఉత్సావాల్లో పంపిణీ చేయాలని నిర్ణయించింది. అయితే కామారెడ్డిలో ఆదివారం పర్యటించిన రాష్ట్ర ఆర్థిక, వైద్యరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు ఎల్లారెడ్డిలో మాట్లాడుతూ.. జూన్ 24వ తేదీ నుంచి పంపిణీ చేయబోతున్నట్టు ప్రకటించారు.

భారీ వర్షం, ఈదురుగాలులు

- జువ్వాడి, బ్రాహ్మణపల్లి గ్రామంలో లేచిపోయిన ఇంటి పై కప్పులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండలం లోని జువ్వాడి, బ్రాహ్మణపల్లి గ్రామంలో నాలుగు ఇండ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. వర్షానికి ఇంట్లో ఉన్న ధాన్యం, ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వం తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



ఇంటిపైనుంచి ఎగిరిపోయిన రేకులు

తమ్ముడిని హత్య చేసిన అన్న

- ఆస్తి తగాదాలే కారణం ?
- కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే హనుమంతు షిండే

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-మద్నూర్

తమ్ముడిని అన్న హత్య చేసిన ఘటన మండలంలోని సోనాల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఆస్తితగాదాలే దీనికి కారణమని తెలుస్తోంది.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు
- మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలింపు


నవతెలంగాణ-పిట్లం

ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్‌రావు పల్లి ఎక్స్ రోడ్డు వద్ద జరిగింది. నిజాంసాగర్ ఎస్సై రాజు కథనం మేరకు.. మహారాష్ట్రలోని దేగ్లూర్‌కు చెందిన ఓమర్ ఫరుక్ మరో నలుగురు శనివారం రాత్రి దెగ్లూర్ నుంచి హైదరాబాద్ వెళుతుండగా నర్సింగ్‌రావుపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద వంతెనపై కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఓమర్ ఫరూక్ (40) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇద్దరిని పిట్లం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మరో ఇద్దరిని బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆ నలుగురిని హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



మృతిచెందిన ఓమర్‌ఫరూక్

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి



నవతెలంగాణ-దోమకొండ

విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన పున్న సాయిలు (50) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో పులి వెందుల లక్ష్మి ఇంటి వద్ద దాబా పైకి వెళ్లి పెయింట్ వేస్తూ వుండగా మెయిన్ వైర్లకు తగలడంతో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. 33/11 కేవీ పవర్ లైన్స్ ఇంటికి ఆనుకొని ఉన్న ఎలక్ట్రిసిటీ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో మృతి చెందాడని ప్రజలు ఆరోపించారు. కరెంటు పోలు ఇంటిని ఆనుకొని ఉన్న పట్టించుకోకుండా ఒక వ్యక్తి మరణానికి కారణమైన ఎలక్ట్రిసిటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అంటున్నారు.

చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యమే



మంచినీటి కుళాయి పక్కన ఉన్న మురికి చెత్త

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం గత వారం రోజులుగా గ్రామ గ్రామాన పారిశుధ్య వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించింది. కానీ పలు ప్రాంతాలలో పారిశుధ్య వారోత్సవాలు నామమాత్రంగా నిర్వహించి మమా అనిపిస్తున్నారు. దానికి నిదర్శనమే ఈ ఫోటో. సాలూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గత 15 రోజుల క్రితం పారిశుధ్య కార్మికులు మురికి కాలువలను శుభ్రం చేశారు. ఆ మురికి చెత్తను తీసిన పంచాయతీ సిబ్బంది దానిని ఎత్తివేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎస్సీ కాలనీలో మంచినీటి కుళాయి పక్కనే మురికి కాలువలోని చెత్తను తీసి పెట్టినా.. ఇంతవరకు దానిని తొలగించలేదు. దాంతో మంచినీరు కలుషితమవుతుంది.

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌ను వివరణ కోరగా సరిపడా పారిశుధ్య సిబ్బంది లేక ఆలస్యం అవుతుందని ఆయన సమాధానమిచ్చారు. మేజర్ గ్రామపంచాయతీ కావడంతో పారిశుధ్య సిబ్బంది బస్టాండ్ ప్రాంతంలోనే రహదారులు ఊడవడానికి, కార్యాలయం శుభ్రం చేయడానికే సరిపోతున్నారు. అధికారులు స్పందించి గ్రామపంచాయతీలో సరిపడా పారిశుధ్య కార్మికుల నియామకం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైద్య రంగంలో

దేశానికి తెలంగాణ ఆదర్శం

- ఈ యేడాదే కామారెడ్డి మెడికల్ కాలేజ్
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు..
- ఎల్లారెడ్డిలో 100 పడుకల ఆసుపత్రికి శంకుస్థాపన...

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్

వైద్యరంగంలో దేశానికి తెలంగాణ ఆదర్శమని వైద్యరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఆదివారం 100 పడకల ఆసుపత్రికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు సూపర్ స్పెషాల్టీ వైద్య సేవలు ఉచితంగా అందుతున్నాయని అన్నారు. గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఒక్క డయాలసిస్ కేంద్రం కూడా లేదని, తెలంగాణలో అన్ని నియోజకవర్గాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. పైగా డయాలసిస్ పేషెంట్లకు ఉచిత బస్సు పాసు, పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. 63 శాతం డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరుగుతున్నాయని వివరించారు. ఈ సంవత్సరం కామారెడ్డి జిల్లాలో మెడికల్ కాలేజ్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఇక వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. తెలంగాణలో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ వల్ల పేద గిరిజన విద్యార్థులకు వైద్య విద్య నేర్చుకునే అవకాశం లభించిందని వివరించారు. దేశంలో తెలంగాణ వైద్య ఆరోగ్య రంగంలో మూడో స్థానంలో ఉందని, మొదటి స్థానంలోకి తీసుకొచ్చేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే సురేందర్ కృషి వల్ల ఎల్లారెడ్డికి వంద పడకల ఆసుపత్రి మంజూరై శంకుస్థాపన చేసుకోగలిగామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, జడ్పీ చైర్మన్ శోభ, ఎమ్మెల్యే జాజల సురేందర్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జడ్పీటీసీ ఉష గౌడ్, కౌన్సిలర్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఆత్మీయ సమ్మేళనానికి హరీష్‌రావు హాజరు..

లింగంపేట్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హరీష్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. తెలంగాణలో బీజేపీ దుకాణం బంద్ అయితదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని ఆరోపించారు.

ఆ రెండు పార్టీలు చేసిన అభివృద్ధి శూన్యం : ఎంపీ బీబీ పాటిల్

కాంగ్రెస్, బీజేపీ గల్లీ నుంచి ఢిల్లీ వరకు అధికారంలో ఉన్న సమ యంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని జహీరాబాద్ పార్లమెంటు సభ్యులు బీబీ పాటిల్ విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో అన్ని సంక్షేమ పథకాలను అమలు చేశారని, దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో రోడ్ల మహర్దశకు చేరుకున్నాయని అన్నారు. అన్ని గ్రామీణ ప్రాంతాలకు సైతం బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రహదారులు పూర్తయ్యాయని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోని నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. మంత్రి హరీష్ రావు సమక్షంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీపీ మాధవి బాలరాజు గౌడ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దివిటి రమేష్, మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎంకే ముజీబుద్దిన్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ తిరుమలరెడ్డి, లింగంపేట్ జెడ్పీటీసీ సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిద్ధిరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఎంపీపీ గరీబున్నీసా నయీమ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణలో త్వరలో బీజేపీ దుకాణం బంద్

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు

వివరాలు మెయిన్‌లో..

ఇంటి ముందు కరెంటు స్తంభం

- ఎన్నిసార్లు విన్నవించినా తొలగించని అధికారులు



ఇంటి ఎదురుగా విద్యుత్ స్తంభం

నవతెలంగాణ-కోటగిరి

ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసి కరెంటు స్థంభం ఆ కుటుంబ సభ్యులకు ఇబ్బందికరంగా మారింది. దీనిని తొలగించాలని వారు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. వివరాల్లోకెళ్తే.. మండల కేంద్రంలోని పోచారం కాలనీలో నివాసముంటున్న రంజాని కూలీ పని చేస్తే తప్ప జీవనం గడవని పరిస్థితి. బయట ఉండాల్సిన విద్యుత్ స్థంభం ఆయన ఇంటి ఎదుట ఉండటంతో వారి కుటుంబ సభ్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థంభాన్ని తొలగించాలని గత పది సంవత్సరాల నుంచి అధికారులకు మొరపెట్టుకున్నా.. పట్టించుకోవడం లేదని, స్థంభాన్ని తొలగించాలంటే ఎస్టిమేషన్ వేయాలి, డీడీ కట్టాలని అధికారులు చెబుతున్నారని రంజాని తెలిపాడు. ప్రతి రోజు కూలి దొరికితే జీవనం గడిపే పరిస్థితి తమదని, చేతిలో చిల్లిగవ్వలేని తాను డీడీ ఎలా కట్టాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రైవేట్ వెంచర్లలో ఆగమేఘాల మీద పనులు పూర్తిచేసే అధికారులు పేదవాడి ఇంటి ఎదుట ఉన్న విద్యుత్ స్థంభాన్ని తొలగించడానికి చర్యలు తీసుకోవడం లేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా కరెంటు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



బాధితుడు రంజానీ

ఆత్మీయ సమ్మేళనాలు కాదు..

ఆత్మవిమర్శ చేసుకోవాలి

- టీజేఎస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి నిజ్జన రమేష్
- మూడో ప్లీనరీ గోడప్రతుల ఆవిష్కరణ

నవతెలంగాణ-లింగంపేట్

వడగండ్ల వాన కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా ఆత్మీయ సమ్మేళనం చేసుకోవడం సిగ్గుచేటని.. రాష్ట్ర ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకోవాలని తెలంగాణ జన సమితి ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ నిజన రమేష్ ముదిరాజ్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ జన సమితి మూడవ ప్లీనరీ గోడప్రతులను విష్కరించారు. ఈ సందర్భంగా నిజ్జన రమేష్ మాట్లాడుతూ.. వడగండ్ల వానలతో రైతులు నష్టపోయారని, ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు వారిని ఆదుకోలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఓట్ల కోసమే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తుందని, మరొక్కసారి రైతులను మోసం చేయడం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త ఏశాలు ఏస్తున్నదని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మళ్ళీ కొత్త పథకాలతో ఆకర్షణ చేసి మళ్ళీ నిండా ముంచుతుందని చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులతో తూతూ మంత్రంగా సర్వే చేశారని, కానీ రైతులకు మాత్రం నష్టపరిహారం ఇవ్వలేరని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆందోళనకు గురికావొద్దని మీ కోసం రాబోయే రోజుల్లో టీజేఎస్ పార్టీ పోరాటం చేస్తుందని, ప్రభుత్వం దిగి రాకపోతే ఖచ్చితంగా భారీ ధర్నా చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మంత్రి హరీష్‌రావు వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం కేవలం రూ.10వేలు ఇస్తామని చెప్పారు కానీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదని అన్నారు. అదేవిధంగా ఎకరానికి రూ.50వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని నిజ్జన రమేష్ డిమాండ్ చేశారు. 4న సూర్యాపేట జిల్లాలో జరిగే ప్లీనరీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కన్వీనర్ కుంబాల లక్ష్మణ్ యాదవ్, జిల్లా నాయకులు ఫూల్ సింగ్ నాయక్, రవికుమార్, మండల నాయకులు తిర్మలేష్ నాయుడు, గోపాల్ ముదిరాజ్, రైతు నాయకులు లక్ష్మణ్, పోచయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

- 'ఆయన నాటిన మొక్కనే నేను'
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్/వర్ని

మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ ఎన్‌టీ రామారావు సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ, బీర్కూర్ తదితర మండలాల్లో ఎన్టీ రామారావు 100వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని బీర్కూర్ మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ఎన్టీ రామారావు రాజకీయ అడుగులు నేర్పిన మహా ఘనుడు అని, తనకు రాజకీయ అడుగులు నేర్పిన ఎన్టీ రామారావును ఎప్పటికీ మర్చిపోలేని అన్నారు. ఎన్టీ రామారావు నాటిన మొక్కనే నేడు మీ ముందు స్పీకర్‌గా ఉన్నానని తెలిపారు. తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఆయన జీవితం సాగిందన్నారు. తెలుగు సినిమాలలో ఆయన వేసిన పాత్రల ప్రభావం ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందన్నారు. రాజకీయ చైతన్యం, రాజకీయంలో నాయకులు ఎలా నడచుకోవాలని చూపించిన మహనీయుడు అని కొనియాడారు. నందమూరి తారక రామారావు సామాన్య ప్రజలకు, పేదలకు, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దిన ఘనుడని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పటేల్ పట్వారి వ్యవస్థను నిర్మూలించి, దొరతనాన్ని ఉక్కు పాదంతో అణిచివేసి ప్రతినిత్యం ప్రజల అవసరాలు తెలుసుకొని అభివృద్ధి దిశలో నడిపిన ఏకైక ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని చెప్పారు. డ్వాక్రా మహిళా సంఘాలకు నాంది పలికి మహిళలంటే ఆదిపరాశక్తి అని, మహిళలకు ప్రతి రంగంలో 50 శాతం రిజర్వేషన్ ఉండాలని, ప్రతి రంగంలో ముందుండాలని మహిళలను ప్రోత్సహించిన మహాయోధుడు అని తెలిపారు. ఆడబిడ్డకు తన పుట్టిన ఇంట్లో తన అన్నద మ్ములతోపాటు తనకు కూడా సమానమైన ఆస్తిపస్తులు వచ్చే విధంగా జీవో అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ద్రోణవల్లి అశోక్, మాజీ సర్పంచ్ కమ్మ సత్యనారాయణ, ఎంపీపీ రఘు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అప్పరావు, ఆనంద్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్ : నివాళులర్పిస్తున్న స్పీకర్

వర్ని : మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో ఎన్టీఆర్ వందవ జయంతి వేడుకలను ఎన్టీఆర్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. స్వీట్లు, మజ్జిగ ప్యాకెట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెలగపూడి గోపాల్, అధ్యక్షులు నామాల సాయిబాబు, ఎంపీపీ మేక శ్రీ లక్ష్మి వీర్రాజు, వైస్ ఎంపీపీ బాలరాజు, కమ్మ సంఘం మండలాధ్యక్ష కార్యదర్శులు రెడ్డి చౌదరి, వల్లూరి గణపతి, మాట్రిక్స్ నవీన్, ఉప సర్పంచ్ కృష్ణ, ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



వర్ని : ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో అభిమానులు

వీఓఏల డిమాండ్లను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఐకేపీ వీఓఏల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంత్రి హరీష్‌రావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వీఓఏలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 35 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వీఓఏలకు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకట్ గౌడ్, వీవోఏ నాయకులు శివరాం తదితరులు పాల్గొన్నారు.



దశదిన కర్మలో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-ఆర్మూర్



రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తల్లి మంచిరెడ్డి పద్మమ్మ దశదిన కర్మ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పీయూసీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యేచ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్న గారి జీవన్ రెడ్డి హాజరై నివాళులర్పించారు.

కరీంనగర్ సభకు వెళ్లిన పూసల సంఘం నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్



పూసల చైతన్య వేదిక ఆధ్వర్యంలో చేపడుతున్న 'పూసల సమర శంఖారావం' కరీంనగర్ సభకు ఆదివారం ఉదయం బాల్కొండ ఉమ్మడి మండల పూసల సంఘం నాయకులు వాహనాల్లో బయలుదేరి వెళ్ళారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అవాలా శ్రీధర్, జిల్లా సెక్రటరీ పస్నీర్ శ్రీనివాస్, జిల్లా ప్రతినిధులు శ్యామ్, కళావతి, లలిత, శ్రీనివాస్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి ప్రతిబింబించేలా 'దశాబ్ది' సంబురాలు

- అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలి
- తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని పల్లెపల్లెనా ఆవిష్కరింపజేయాలి
- అధికారులు, ప్రజాప్రతినిధులకు మంత్రి ప్రశాంత్ రెడ్డి పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన మీదట అనతి కాలంలోనే తెలంగాణ సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించాలని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ, పల్లెపల్లెనా తెలంగాణ ప్రగతిని ఆవిష్కరింపజేయాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో పనిచేస్తూ దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలని వారిని కార్యోన్ముఖులు చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆదివారం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ ఆకుల లలిత, మేయర్ నీతూ కిరణ్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, ఇంచార్జ్ సీ.పీ ప్రవీణ్ కుమార్ తదితరులతో కలిసి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దశాబ్ది ఉత్సవ ఏర్పాట్లపై అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు.



మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

సమైక్య రాష్ట్రంలో వంచన, అనేక రకాల మోసాలకు గురైన తెలంగాణ సమాజం ప్రత్యేక రాష్ట్రం కోసం ఆరు దశాబ్దాలకుపైగా అలుపెరుగని పోరాటం చేసిందని మంత్రి గుర్తు చేశారు.

ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, అన్ని వర్గాల వారి కృషితో గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను పున్ణశ్చరణ చేసుకుంటూ ప్రజలకు వీటి గురించి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను చేపడుతోందని అన్నారు. పండుగ వాతావరణంలో ఉత్సాహభరితంగా ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని మంత్రి సూచించారు. అందరి సహకారం, భాగస్వామ్యంతోనే వేడుకలు విజయవంతం అవుతాయన్నారు. తొమ్మిదేళ్లలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, వివిధ వర్గాల ప్రజలకు చేకూరిన మేలు గురించి శాఖల వారీగా కరపత్రాలు, ఫ్లెక్సీలు, బుక్ లెట్ల ద్వారా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్యుత్, సాగునీటి రంగం, పారిశ్రామిక ప్రగతి, విద్య, వైద్యం, సంక్షేమం, ఐ.టీ రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రజలకు విశదపర్చాలన్నారు. నియోజకవర్గాలకు జిల్లా స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా, మండల స్థాయిలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మమేకమై ప్రజలందరినీ భాగస్వాములు చేస్తూ ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవ కార్యక్రమం ఉంటుందని, 3న అన్ని రైతు వేదికల్లో రైతు దినోత్సవం జరపాలని, 4న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్షా దివస్, 5న విద్యుత్ విజయోత్సవం, 6న తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాలను నిర్వహించాలని వివరించారు. 9న తెలంగాణ సంక్షేమ సంబరాలను, 10న తెలంగాణ సుపరిపాలన దినోత్సవాన్ని, 11న సాహిత్య దినోత్సవం, 12న తెలంగాణ రన్, 13న మహిళా సంక్షేమ దినోత్సవం, 14న తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం, 15న పల్లె ప్రగతి దినోత్సవం, 16న పట్టణ ప్రగతి దినోత్సవం, 17న తెలంగాణ గిరిజనోత్సవం, 18న తెలంగాణ మంచినీళ్ల పండుగ, 19న తెలంగాణ హరితోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. 20న తెలంగాణ విద్యా దినోత్సవంలో భాగంగా అన్ని కళాశాలలు, పాఠశాలల్లో జెండాను ఎగురవేయాలని, విద్యాలయాలను అందంగా ముస్తాబు చేయాలని, విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేయాలని, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించాలని, మన ఊరు - మన బడి పనులు పూర్తయిన చోట పాఠశాలలను ప్రజాప్రతినిధులచే ప్రారంభోత్సవాలు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 21న తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఆలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలను అలంకరింపజేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. 22న అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరపున విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్, చిత్రా మిశ్రా, డీఎఫ్ఓ వికాస్ మీనా, జెడ్పీ సీఈఓ గోవింద్, డీఆర్డీఓ చందర్, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాలను సాధించేవరకు సంఘటితంగా పోరాడాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపు



మాట్లాడుతున్న రమేష్‌బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండ్ల స్థలాలను సాధించే వరకు సంఘటితంగా పోరాడాలని సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాలకోసం ఆదివారం నాల్గవ రోజు పోరాటం జరిగింది. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. నిరుపేదలకు ఇండ్లు స్థలాలను ఇండ్ల నిర్మాణంకోసం రుణాలను ఇస్తామని వాగ్దానం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దశాబ్ద కాలంగా ఇండ్ల స్థలాలు ఇండ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో అధికారులకు ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకొని తిరిగినా నివాస స్థలాలు రాకపోవడంతో పేదలు విసిగి వేసారి పోయారన్నారు. ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీసుకొని అక్రమ సంపాదన గడి ఇస్తున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్టుగా ఉంటున్నారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారన్నారు. 171 సర్వే నంబర్‌లో ఉన్న ఎనిమిదిన్నర ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాలకు గురై కేవలం మూడున్నర ఎకరాలు మాత్రమే మిగిలిందని, ఈ భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కండ్లు పడి కబ్జాచేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ భూములను పేదలకు పట్టాలను మంజూరు చేసి ఇళ్ల నిర్మాణం కోసం రుణాలు ఇవ్వాలని అన్నారు. అంతవరకు పేదలందరూ ఐక్యంగా సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోవర్ధన్, నగర నాయకులు సుజాత, ధ్యారంగుల కృష్ణ, అబ్దుల్, మహేష్, నిరుపేదలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న టీయూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

తెలంగాణ యూనివర్సిటీ లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేస్తూ ఆదివారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ అధ్యాపకుల కోసం జీవో నెంబర్ 16 తీసుకువచ్చి జూనియర్ కళాశాల లెక్చరర్ లను, డిగ్రీ కళాశాల రెగ్యులర్ చేశామని, తొందర్లోనే యూనివర్సిటీ లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను కూడా రెగ్యులర్ చేయడానికి సానుకూలంగా ఉందని తెలిపారు. వీలైనంత తొందరలో రెగ్యులరైజ్ చేయడానికి పరిశీలిస్తున్నామని, కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కాంట్రాక్ట్ అధ్యాపకులు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి మీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ .నారాయణ గుప్తా మాట్లాడుతూ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు, అన్ని అర్హతలు కలిగి ఉన్నామని ,10 నుండి 20 సంవత్సరాలుగా యూనివర్సిటీలో విద్యా బోధన చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ గంగా కిషన్, డాక్టర్ స్వామి, డాక్టర్ జోష్నా, డాక్టర్ సునీత, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ రాజేశ్వరి,శరత్ ఆనంద్,గోపి రాజ్, నిరంజన్, సరిత, శ్రీకాంత్, సందీప్, శరత్, దిలీప్, నాగేంద్రబాబు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వీసీని తొలగించాలి

- చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తాం
- ప్లకార్డులతో పీడీఎస్‌యూ నాయకుల నిరసన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవిందర్ ను తొలగించి, వెంటనే అయనపై చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ కి వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం చేస్తామని తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యూ అధ్యక్షులు సంతోష్ అన్నారు. ఆదివారం యూనివర్సిటీ లో పీడీఎస్‌యూ కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీలో అవినీతి అక్రమాలు చేస్తున్న వైస్ ఛాన్సలర్ పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే, తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులుగా బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చేస్తామని వివరించారు. యూనివర్సిటీ విద్యార్థులు ఫీజుల రూపంలో కట్టిన డబ్బులను పరికరాల కొనుగోలు పేరుతో కోట్ల రూపాయలు నిధులను వీసీ దుర్వినియోగం చేశారని, తెలంగాణ యూనివర్సిటీలోనే ఈసి మీటింగ్ పెట్టాలని, యూనివర్సిటీ బడ్జెట్ నుంచి అక్రమంగా ఖర్చు చేసిన డబ్బంత రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈసీ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయకపోతే ఈసీ సభ్యులంతా వేంటనే రాజీనామా చేయాలన్నారు. వీసీ రవీందర్ గుప్తా తన అధికార పరిధిని దాటి యూనివర్సిటీలో ఉద్యోగాలు ఇస్తామని భూములు కోల్పోయిన గిరిజనులకు, గ్రామీణ ప్రాంతాల దళితులకు, బీసీలకు, మైనారిటీలకు మాయ మాటలు చెప్పి వాళ్ల దగ్గర నుంచి లక్షల రూపాయలు తీసుకుని, వాళ్లతో పనులు చేయించుకొని జీతాలు ఇవ్వకుండా, ఆర్టికల్ 21 ప్రకారం ప్రాథమిక హక్కులను హరిస్తున్నారని పేర్కొన్నారు. వాళ్ళందరికీ అండగా ఉంటామని, మా దగ్గర వారి ఆధారాలు ఉన్నాయని, జిల్లా, రాష్ట్ర ,కేంద్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనారిటీ మానవ హక్కుల కమిషన్ను సంప్రదిస్తామని, వాళ్లు మమ్మల్ని సంప్రదిస్తే వాళ్లకు న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని అన్నారు. 9912252495, 9573385794 నెంబర్లకు సంపదించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రమేష్, సాయి తేజ, రాజ్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

డప్పుల పంపిణీ

నవతెలంగాణ-ఏర్గట్ల



దప్పులు అందజేస్తున్న రాజన్న కుమారులు

ఏర్గట్ల పిఏసీఎస్ మాజీ అధ్యక్షులు కీర్తిశేషులు శివన్నోళ్ళ రాజన్న స్మారకార్థం మండల కేంద్రంలోని దళిత, మాదిగ సంఘ సభ్యులకు ఆయన కుమారులు శివన్నోళ్ళ శివకుమార్, శివన్నోళ్ల రాజు 25 వేల రూపాయలతో 25 డప్పులను అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం పోచమ్మ దేవి పండగ రోజున డప్పులను అందజేస్తామని, ఇది ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో మాదిగ సంఘ పెద్దలు సారంగి దేవయ్య, పస్క బాలరాజ్, కాంగ్రెస్ నాయకులు ముస్కు మోహన్, కురాకుల బొర్రన్న, బద్దం కిషన్, మునిరోద్దీన్, ఆరపు మాణిక్యం, సంఘ సభ్యులు కనగుర్తి ఊషన్న, గంగాధర్, భూమయ్య, దేవన్న గంగారాం, భాను, సాయన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితులపై వివక్ష ఎందుకు..?

- ఆరోపణలు నిరూపించండి
- రిజిస్ట్రార్ కనకయ్యను బెదిరిస్తే ఉద్యమిస్తాం :ఎంఎస్ఎఫ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కనకయ్యను బెదిరింపులకు గురి చేస్తే ఊరుకునేది లేదని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఎంఎస్ఎఫ్ తెలంగాణ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ బొల్లారపు వెంటకరమణ మాదిగ హెచ్చరించారు. ఆదివారం టీయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ యూనివర్సిటీలో క్యాస్ట్ ఫీలింగ్‌తో రాజకీయాలు చేస్తున్నారని. ఇది మంచిది కాదని అన్నారు. 2021లో యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా కనకయ్య విధులు నిర్వహించారని, రెండు నెలల వ్యవధిలోని కనకయ్యను తొలగించి ఉన్నత విద్యా కమిషనర్, ఈసీ సభ్యులు రిజిస్ట్రార్‌గా యాదగిరిని నియమించారన్నారు. యాదగిరి స్వచ్ఛందంగా వెళ్ళిపోతే బీసీ గౌడ కు చెందిన శివశంకర్ ను నియమించారని, శివశంకర్ పని చేసినంత కాలం ఈసీ సభ్యులుగా ఉన్న గంగాధర్ గౌడ్, మారయ్య గౌడ్, వసుంధర దేవి గౌడ్‌లకు ఎందుకు ఈసి సమావేశాలు గుర్తుకు రాలేదని వారు ప్రశ్నించారు. ఎస్సీకి చెందిన విద్యావర్ధిని నియమిస్తే అమెను సస్పెండ్ చేయాలని తీర్మానించారని, ఇది ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఎలాంటి విచారణ లేకుండా ఎందుకు ఈసీ నిర్ణయం తీసుకుందని, ఆ తర్వాత మళ్ళీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ యాదగిరిని ఎందుకు ప్రపోజ్ చేశారని అన్నారు. యాదగిరికి సభ్యులు మద్దతు తెలపడం వెనుక అసలు రహస్యాలు వేరే ఉన్నాయని, వాటిని త్వరలోనే బయటపెడ తామని హెచ్చరించారు. కనకయ్యను రిజిస్ట్రార్‌గా నియమిస్తే ఎందుకు ఓర్చుకోవడం లేదని వారన్నారు. ఇదే ఈసీ సభ్యులు ఉస్మానియా యూనివర్సిటీలోని సత్యనారాయణను తీసుకురావాలని ఎంతో ప్రయత్నం చేశారని, అది కుదరకపోవడంతో మళ్ళీ యాదగిరిని తెరమీదకి తెచ్చారని వెల్లడించారు. దళితుడైన కనకయ్యను నియమిస్తే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, గంగాధర్ గౌడ్ కనకయ్యకు ఫోన్‌చేసి బెదిరించడం వెనక రహస్యం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈసీ తమ పరిధి దాటి ప్రవర్తించకూడదని ఒకవేళ అలా చేస్తే అందుకు తగినట్టుగానే దళిత సంఘాలు స్పందిస్తాయని హెచ్చరించారు. ఇప్పటికైనా ఈసీ సభ్యులు తీరు మర్చుకుని కనకయ్యను రిజిస్ట్రార్‌గా కొనసాగించాలని అన్నారు. సమావేశంలో కార్యదర్శి ఆడెపు అభినయి మాదిగ, ఉదయ్ మాదిగ పాల్గొన్నారు.

కొత్తగూడెం బహిరంగ సభను జయప్రదం చేయండి : సీపీఐ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూన్ 4న జరిగే కొత్తగూడెం బహిరంగ సభను జయప్రదం చేయాలని నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. నిజామాబాద్ జిల్లా సిపిఐ పార్టీ కార్యాలయంలో చలో కొత్తగూడెం సిపిఐ గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ బిజెపికో హటావో దేశ్ కో బచావో నినాదంతో ఏప్రిల్ 14 నుండి తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో గడపగడపకు గ్రామ గ్రామాన బిజెపి మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఈకార్యక్రమం ముగింపులో భాగంగా జూన్ 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈసభకు నిజామాబాద్ నగరం లోని సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర నాయకులు రఘురాం నాయక్, బోడ మీది అనిల్ కుమార్, పి.హనుమాన్లు, జి.రమేష్ ,సాయి కుమార్, బాలాజీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని వదిలి వెళ్లారు.. మీరు ఎన్టీఆర్ వారసులా..?

- నిజామాబాద్ పార్లమెంట్ అబ్జర్వర్ దేగాం యదాగౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పార్టీని కష్టకాలంలో వదిలేసి పోయిన మీరు ఎన్టీఆర్ వారసులని అంటారా.. అని పార్లమెంట్ అబ్జర్వర్ దేగాం యదాగౌడ్ మండిపడ్డారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు శతజయంతి వేడుకలు నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఆదిఆవరం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంట్ అబ్జర్వర్ దేగాం యదాగౌడ్ పాల్గొని ఎన్టీఆర్ చౌరస్తాలో గల విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు లేసి శతజయంతి సందర్భంగా కేక్ కట్ చేసి దేగామ్ యదగౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశయాల కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఈరోజుల్లో ఎలక్షన్లు సమీపంలో ఉన్నందున టీఆర్ఎస్ నాయకులు ఎన్టీఆర్ విగ్రహాలను ప్రతిష్టిస్తూ మేము ఎన్టీఆర్ రాజకీయ వారసులమే అని చెప్పుకోవడం సిగ్గుచేటు అని, అంతకంటే దారుణం మరోటి లేదని, ఆయన చేసిన సంక్షేమ ఫలాల్లో ప్రజా శ్రేయస్సు ఎక్కడని ప్రశ్నించారు. పదవులు అనుభవించి, పార్టీని కష్టకాలంలో వదిలేసి పోయిన మీరా... ఎన్టీఆర్ వారసులు అంటారా అని మండిపడ్డారు. ఆ మహనీయుని విగ్రహానికి గౌరవించగానే మీరు ఆయన లాంటి మంచి వ్యక్తిత్వంగల రాజకీయ నాయకులు గా మారలేరని అన్నారు. అంతా ఓటు బ్యాంకు కోసమే రాజకీయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.సినిమా రంగంలోనూ చెరగని ముద్ర వేశారని గుర్తు చేశారు. పోలీస్‌పట్వారీ వ్యవస్థను రద్దు చేసి బానిస వ్యవస్థకు స్వస్తి పలికిన ఏకైక మహా నాయకుడు నందమూరి తారక రామారావు అని, రెండు రూపాయల కిలో బియ్యం, మొట్టమొదటిగా 30 రూపాయల పెన్షన్లు అందించిన ఘనత కేవలం తెలుగుదేశం పార్టీదే అని అన్నారు. చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రజల చేరువకే ప్రభుత్వాన్ని అందుబాటులోకి తెచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదని అన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలోనే ఎండగడుతూ ప్రజానీకానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో రేంజర్ల సురేష్, కోయెడి నర్సింలు, ప్రతాప్ రెడ్డి, జక్కుల రాజేశ్వర్, మావురి రాజశేఖర్, రఫిక్, లవంగ రాజు, శంకర్ ముదిరాజ్, నారా గౌడ్, రాములు, రన్వీర్ రెడ్డి, చెన్నమ్మ, కాంతా బాయ్, రవి, నాగభూషణ్, రాములు, అభిమన్యు రాజు, అప్సర్, కలీం, ఆమెర్, ఇమ్రాన్, వసీం, నదీమ్, గులాం, రఫిక్, ఇర్ఫాన్, సుజీవన్, జమున, స్వరూప, సుజాత, రాజమణి, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.



కేక్ తినిపిస్తునన దేగాం యాదాగౌడ్

డబుల్ బెడ్రూంలపై చిత్తశుద్ధిలేని కేసీఆర్ ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్‌పల్లి నాగేష్ రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో కేసీఆర్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, అర్హులందరికీ ఉచితంగా ఇళ్లు కట్టిస్తామని చెప్పిన ప్రభుత్వం స్థలం ఉన్నవారికి రూ.3 లక్షలు అందిస్తామని చెప్పడం అసమర్థతకు నిదర్శన మని మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. ఆదివారం నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కాట్ పల్లి నగేష్ రెడ్డి ఇతర నాయకులతో కలిసి డిచ్ పల్లి మండలంలోని నడిపల్లి గ్రామంలో పిల్లర్లకే పరిమితమైన డబుల్ బెడ్ రూమ్ లను కారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని తప్పనిసరి పరిస్థితుల్లో నెరవేరుస్తుందన్నారు. నడిపల్లి గ్రామంలో గత ఏడెళ్ళ క్రితం ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్‌లు పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారని, సర్కారు ఇచ్చే ఆ మూడు లక్షల రూపాయలు పనులు చేసే కూలీలకే సరిపోతాయని వ్యాఖ్యానించారు.. కార్యక్రమంలో ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, భాస్కర్ రెడ్డి, పోలసని శ్రీనివాస్, ధర్మ గౌడ్, వాసు, మాజీ కో ఆప్షన్ సభ్యులు శ్యాంసన్, ఎంపిటిసి నర్సయ్య, దేవకరణ, శ్రీనివాస్, ఇబ్రహీం, నరేందర్, వెంకట్ స్వామి, సుధాకర్, అనీల్, ఆకాష్ వినోద్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపతిరెడ్డి

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని బోధన్ ఎసిపి కిరణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘం భవనంలో విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటినుంచి లక్ష్యం ఎంచుకొని నిరంతరం కష్టపడాలని సూచించారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. అనంతరం ఏసీపీ కిరణ్ కుమార్‌కు పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. మొత్తం 31 మందికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, డివిజన్ అధ్యక్షుడు గద్దె గంగాధర్, జిల్లా కార్యదర్శి రాజారం, డివిజన్ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి నటరాజ్, మంచిర్యాల సురేష్ కుమార్, రాగి ప్రభాకర్, బొమ్మెన శంకర్, శ్యామ్, జిల్లా డివిజన్ కార్యవర్గ సభ్యులు తదితరులున్నారు.



విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేసిన ఏసీపీ

శ్రీ కాలభైరవ స్వామిని దర్శించుకున్న జడ్జి భార్గవి


ప్రసాదాలను అందజేస్తున్న పూజారి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్నపల్లి (రామారెడ్డి)లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానాన్ని కామారెడ్డి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి, ఆలయ చరిత్రను వివరించారు. అనంతరం ఆలయ కమిటీ వారికి శాలువాతో సన్మానించి, స్వామి వారి జ్ఞాపక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సురేందర్, పూజారి శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్


అరెస్టు అయిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో వైద్య ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు ఆదివారం పర్యటన సందర్భంగా పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ నాయకులు ప్రశాంత్ గౌడ్, మర్రి బాలకిషన్, విద్య సాగర్ తదితరులున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

దోమకొండ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ఆముదాలపల్లి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద దోమకొండ మండల నూతన ప్రెస్‌క్లబ్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షులుగా బొమ్మెర బాలయ్య, బండారి శంకర్, అధ్యక్షులు బీసు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి గరిగే సురేష్, ఉపాధ్యక్షులు సాప శ్రీనివాస్, గోత్రల విక్రమ్, ప్రచార కార్యదర్శి గాజులపల్లి కాశిరెడ్డి, సహాయ కార్యదర్శి అంబాటి అనిల్ కుమార్, ప్రెస్‌క్లబ్ సభ్యులు అబ్రబోయిన శ్రీనివాస్, దేవోల్ల రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ


ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న పలువురు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రధాన రహదారి పక్కన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు శత జయంతి సందర్భంగా ఎన్టీఆర్ అభిమానులు పార్టీలకు అతీతంగా విగ్రహ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నందమూరి తారక రామారావు మార్గదర్శకత్వంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ పత్తి లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీ శంకర్, కోటగిరి విండో చైర్మన్ కూచి సిద్దు, ఎంపీటీసీ కొట్టం మనోహర్, బర్ల మధు, నాగులు, నార్ల శ్రీనివాసరావు, రాధా, గుత్తా రంగబాబు, మాజీ జెడ్పీటీసీ శివరాజ్ దేశాయ్, అభిమానులు కొల్లూరు రమేష్, దోప్పలపూడి శ్రీధర్, దావులయ్య, వేములపల్లి ఆనంద్, యార్లగడ్డ రవి తదితరులు పాల్గొన్నారు.


తోటి ఎంపీటీసీకి ఆర్థిక సహాయం


ఎంపీటీసీకి పరామర్శిస్తున్న పలువురు ఎంపీటీసీలు

నవతెలంగాణ-రామారెడ్డి

తోటి ఎంపీటీసీ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మానవత్వంతో ఆర్థిక సహాయాన్ని గిద్ద ఎంపీటీసీ ప్రవీణ్‌గౌడ్ ఆదివారం అందజేశారు. రామారెడ్డి ఎంపీటీసీ-2 నూనె భాగ్యలక్ష్మి శ్యామ్ అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని లక్ష్మీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలుసుకొని, ఆసుపత్రిలో ఆమెను పరామర్శించి, తన వంతు సహాయంగా రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి శామ్, ప్రవీణ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు గర్గుల రాజాగౌడ్, రామారెడ్డి-1ఎంపీటీసీ తుపాకుల రజిత రాజేందర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బొంపల్లి దత్తాత్రి, రాజేందర్‌గౌడ్ తదితరులున్నారు.

పలువురికి నియామక పత్రాలు అందజేత


నియామకపత్రాలను అందజేస్తున్న వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని మండలాలకు సంబంధించిన ఎస్సీ సెల్ విభాగం, మైనార్టీ సెల్ విభాగం మండలాధ్యక్షులకు దళిత విభాగం జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, మైనారిటీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు కలిక్, మండలాధ్యక్షులకు నియామకపత్రాలను అందజేశారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు.. నాగిరెడ్డిపేట్ బోరంచ సాయిలు, లింగంపేట్ మన్నె నరేష్, తాడ్వాయి గడ్డ రాజు, గాంధారి చీమన్ సాయిలు, సదాశివనగర్ భూపెల్లి కవీన్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండలాధ్యక్షులు..

ఎల్లారెడ్డి మహమ్మద్ యూనుస్, లింగంపేట్ సయ్యద్ ఇస్మాల్, గాంధారి సయ్యద్ బషీర్, తాడ్వాయి గఫూర్, సదాశివనగర్ మహమ్మద్ గౌస్, నాగిరెడ్డిపేట్ షహీద్ ఆఫ్రీద్‌కు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం చేయడంలో అనుబంధ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయని మీరు మీ బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీ అధికారంలోకి తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

35వ రోజుకు వీవోఏల నిరవధిక సమ్మె

- పలు మండలాల్లో కొనసాగుతున్న వీవోఏల సమ్మె


బోధన్ : సమ్మెలో పాల్గొన్న వీవోఏలు


ఎడపల్లి మండల కేంద్రంలో..

నవతెలంగాణ-ఎడపల్లి/బోధన్

మండల కేంద్రంలో చేపట్టిన వీవోఏల సమ్మె ఆదివారం 35వ రోజుకు చేరుకుంది. క్షేత్రస్థాయిలో వీవోఏల పాత్ర ఎంతో కీలకంగా ఉందని గ్రహించిన సీఎం కేసీఆర్ వీవోఏల సమస్యలను, డిమాండ్లను పట్టించుకోకపోవడం బాధాకర విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. సమానపనికి సమాన వేతనం కింద నెలకు రూ.18వేల వేతనాన్ని ప్రభుత్వం అమలు చేయాలని, ఉద్యోగ భద్రతతో పాటు బీమా సౌకర్యాన్ని కల్పించాలని జీవో నెంబర్ 51ని సవరిస్తూ పదోన్నతులను కల్పించాలని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో బ్యాంకు రుణాలు గ్రామ సంఘం శ్రీ నిధి రుణాలు తీసుకున్న సంఘం సభ్యులు తిరిగి క్రమంగా చెల్లించడం వల్ల రాష్ట్రంలోనే ఐదో స్థానంలో నిజామాబాద్ జిల్లా నిలిచిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ తమ డిమాండ్లను మాత్రం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఆర్డీఏ బ్యాంకు ఖాతా ద్వారా తమ ఖాతాలోకి నేరుగా వేతనాలను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ సాధక బాధకాలను గుర్తించి తమ డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీవోఏల యూనిట్ ఎడపల్లి మండలాధ్యక్షులు సుదర్శన్, కోశాధికారి పోచయ్య, శోభ, జంగం సంధ్య, కుమ్మరి పుష్ప, మహేశ్వరి, లత, మంజుల, నసీరా బేగం, ఆయా గ్రామాల నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె..

బోధన్ :

మండలంలో వీవోఏల సమ్మె నిరంతరంగా కొనసాగుతుంది. ఆదివారం ఈ సమ్మె 35వ రోజు కొనసాగింది. ప్రభుత్వం తక్షణమే వీఓఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో విజయకుమార్, భూమయ్య, నాగయ్య, సుభాష్, గంగాచారి, కరుణ, భూలక్ష్మి, ఈశ్వరి, రేణుక, అక్షర, సౌజన్య,శైలజ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

- రైతుబంధు ఇప్పించండి
- మంత్రి హరీష్‌రావుకు రైతుల వినతి

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని సుమారు 64 మంది రైతుల సమస్యలు పరిష్కరించి రైతుబంధు ఇప్పించాలని వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావుకు రైతులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 983లో సుమారు 450 ఎకరాలలో 175 మంది రైతులం గత కొద్ది సంవత్సరాలుగా పంటలు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, ఈ సర్వే నెంబర్‌లో ప్రభుత్వ కార్యాలయాలు వందకుపైగా నివాస గృహాలు ఉన్నాయని తెలిపారు. ఇది రెవెన్యూ భూమి అని గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, తెలంగాణ ప్రభుత్వం కొత్త పాస్ పుస్తకాలు సైతం జారీ చేసిందని తెలిపారు.

రెండు సంవత్సరాల పాటు రైతుబంధు ఇచ్చిందని, కానీ ప్రస్తుతం 'మీ భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించారు.' అని అధికారులు చెబుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే తాము పండించిన ధాన్యాన్ని కొనడానికి నిరాకరిస్తున్నారని, ఇటీవల కురిసిన వాన కారణంగా దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని తాము వ్యవసాయ అధికారులు దృష్టికి తీసుకురాగా ఆన్‌లైన్‌లో లేవని వర్తించవని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-బోధన్

స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు శత జయంతి వేడుకలను టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పెంటాఖుర్దు, జాడీజమాల్‌పూర్, ఎరాజ్‌పల్లి గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి సంస్కరణలు గురించి వివరించారు. ఏరాజ్‌పల్లి చెరువు పునర్నిర్మించి వ్యవసాయానికి నీరు అందించిన విషయాన్ని నాయకులు గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ పేదల కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నేటికీ కొనసాగుతుండడం ఎంతో గర్వకారణమని అన్నారు. బోధన్ పట్టణంలోని ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో బాటసారులకు, ప్రజలకు మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కే గోపాల్‌రెడ్డి, పార్టీ నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది సీహెచ్ వి.హనుమంతరావు, బోధన్ మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షులు భాస్కర్, తెలుగు విద్యార్థి నాయకులు సచిన్ పటేల్, సీనియర్ నాయకులు విట్టల్ పటేల్, పావులూరి వెంకటేశ్వరరావు, గోగినేని సుబ్బారావు, ఈశ్వరరావు సూరిబాబు, ఎరాజ్‌పల్లి గంగారాం పాల్గొన్నారు.

బాన్సువాడలో కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న పీసీసీ డెలిగేట్

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

బాన్సువాడలో కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దామని పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని మోస్రా, చింతకుంట, తిమ్మాపూర్, గోవూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందామని నాయకులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను యువత, రైతులు, మహిళలు పడుతున్న ఇబ్బందులను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ, రూ.500లకే సిలిండర్, యువతకు నిరుద్యోగ భృతి, వరికి క్వింటాకు రూ.2500 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. ఎవరికి టికెట్ వచ్చినా గెలిపించుకోవడానికి కలిసి ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో కొత్మిర్కర్వా లక్ష్మణ్, నారాయణ హరి, మెంబర్ అశోక్, జలీల్, నర్సారెడ్డి, ఇంతియాజ్, ఫారం సాయిలు, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బోయిడి లక్ష్మణ్, ఎంటికల శంకర్, కిషన్‌రెడ్డి, గజ్జెల సాయిలు, గంగారాం, భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఆలయాలకు విరాళం


ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కన్నాపూర్‌లో ఐదు పోచమ్మ ఆలయాలను నిర్మించి, ఆదివారం విగ్రహ ఊరేగింపులో భాగంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తమ వంతుగా వడ్డేపల్లి సుభాష్ రెడ్డి రూ.16వేలుమోహన్‌రెడ్డి రూ.2000 ఆలయ కమిటీకి విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మద్దెల భాగయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిరెడ్డి మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుర్నాపల్లిలో పట్టపగలే చోరీ

- రూ.లక్ష 20వేల నగదు, సెల్‌ఫోన్ అపహరణ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు


లబోదిబోమంటున్న బాధితులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో శనివారం పట్టపగలే చోరీజరిగింది. కాగా ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుర్నాపల్లి గ్రామానికి చెందిన తులసి గారి దినేష్‌రెడ్డితోపాటు కుటుంబ సభ్యులు సమీప బంధువుల ఇంటికి వెళ్లారు. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలే ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న రూ.లక్షా 20వేల నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. బంధువుల ఇంటికెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో పాటు బీరువాలో ఉన్న సామానంతా చిందరవందరగా పడి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై పాండేరావుతో పాటు పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీంతో పాటు డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. అయినప్పటికీ ఎలాంటి ఆధారాలు లభించలేదు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోలింగ్ ముమ్మరం చేస్తున్నాం

ఎడపల్లి మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బందితోపాటు తాము కూడా రాత్రివేళల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై పాండేరావు తెలిపారు. సాటాపూర్ గేటు, జానకంపేట్ గ్రామాలలో ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు

.- ఎడపల్లి ఎస్సై పాండేరావు

మంజీరా నదిలో వృద్ధురాలి శవం లభ్యం

నవతెలంగాణ-పిట్లం

వృద్ధురాలి మృతదేహం లభ్యమైన ఘటన బాన్సువాడ మంజీరా నదిలో వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని బండాపల్లి గ్రామానికి చెందిన కొరివి గంగవ్వ (55) ఆదివారం మంజీరా నదిలో అనుమానస్పదస్థితిలో శవమై తేలింది. గంగవ్వ ఎలా మృతి చెందిందని పలువురు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయం

- ఎంఈఓ నాగనాథ్


మాట్లాడుతున్న ఎంఈవో నాగనాథ్

నవతెలంగాణ-బోధన్

త్వరలో పదవ తరగతిని అభ్యసించబోయే విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత శిక్షణలో భాగంగా ప్రతిరోజు అన్ని సబ్జెక్టులలో బోధించడం అభినందనీయమని బోధన్ మండల విద్యాధికారి నాగనాథ్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత తరగతుల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత నెల రోజులుగా ఉచితంగా తరగతులు నిర్వహించిన ఓవర్సీస్ ఎడ్యుకేషన్, మాస్టర్ ట్యూషన్ నిర్వాహకుల కృషి అభినందనీయమని అన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఇంతటి బృహత్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం మంచి పరిణామమని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సమావేశానికి ఇందూర్ స్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిషోర్, విద్యావికాస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, శివాలయం కమిటీ చైర్మన్ శంకర్, రుద్రూర్ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, బచ్చు రాము, దత్తు, వర ప్రసాద్‌రావు, ఓవర్సీస్ ఎడ్యుకేషన్ చైర్మన్ విజయ భాస్కర్, మాస్టర్స్ ట్యూషన్ సెంటర్ డైరెక్టర్ గోపి కృష్ణ, యూనుస్ పటేల్ పాల్గొన్నారు.

ఆలూర్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 22 సంవత్సరాల క్రితం పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ పలకరింపుల మధ్య, ఉద్వేగ భరితంగా సాగింది. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని క్షేమ సమాచారాలు తెలుసుకొని చాలా సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా అప్పుడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు రాజేందర్, ఆకుల శంకర్, భూమయ్య, నారాయణ, నర్సింహులు, దామోదర్, నరసింహ రెడ్డి, అనసూయల పాదాలకు నమస్కరించి వారిని ఘనంగా సన్మానించారు, అదేవిధంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆర్మూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఉపసర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, సొసైటీ చైర్మెన్ కళ్లెం భోజరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మి మల్లేష్ లను కూడా ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ చిన్ననాడు చదివి విడిపోయిన అపుర్వ ఘట్టానికి మమ్మల్ని ఆహ్వానించి భాగస్వామ్యం చేసిన నిర్వాహకులకు శుభాకాంక్షలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దిలీప్, శ్రీకాంత్, బాబు, దుమ్మాజి నవీన్, మల్లేష్, గగ్గుపల్లి ప్రదీప్, ప్రమోద్, సంతోష్, ముత్యం, భోజరెడ్డి లతో పాటు 2000-2001 సంవత్సరం పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హైమాస్ లైన్ల ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న గంగారెడ్డి

నవతెలంగాణ-బోధన్

సాలురా మండల కేంద్రంతో పాటు హున్స గ్రామంలో డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి హైమాస్ లైన్ల ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ కృషితో, జడ్పీటీసీ లక్ష్మి సహకారంతో జిల్లా పరిషత్ నిధులతో సెంట్రల్ లైటింగ్ కోసం శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నర్సన్న, ఎంపీటీసీ శివకుమార్, సర్పంచ్ చీల గంగామణి, ప్యాక్స్ చైర్మన్ రవి, బీఆర్ఎస్ అధ్యక్షుడు మర్కల్ శంకర్, వినోద్ బాబా, ఏఎంసీ వైస్ చైర్మెన్ సాలూర షకీల్, మాజీ ఎంపీటీసీ గంగారాం, డిస్కో సాయిలు, సురేష్, నాగరాజు, రజాక్, రౌఫ్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోపాల్‌లో హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ పీడియాట్రిక్ వైద్యుడు డాక్టర్ నిరూప్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చిన్న పిల్లల కోసం హెల్త్ క్యాంప్ ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఎలాంటి ఆహారం ఇవ్వాలి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. వారి పోషణకు సంబంధించిన ఆహారం గురించి తెలిపారు. చిన్న పిల్లలు ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా చూడాలని అన్నారు. అలాగే ఫీడింగ్ ఇచ్చే తల్లిదండ్రుల ఆహారపు అలవాట్ల గురించి తెలిపారు.కార్యక్రమంలో మోపాల్ సర్పంచ్ క్యాతం రవి ఉప సర్పంచ్ రవికుమార్ ఎంపీటీసీ ముత్తన్న తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2 నుండి రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమై ఉండడం, ఇదే అంశంపై సోమవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్న సమీక్షలో జిల్లా అధికారులు పాల్గొనాల్సి ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

కొండెక్కిన కోళ్ల ధరలు



- చికెన్ ధరలు పెరుగుతున్న వైనం
- తగ్గిన కోళ్ల పెంపకం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో కోడి ధర కొండెక్కింది. ఎండలు ముదరడంతో చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. 15రోజులుగా చికెన్ ధర రోజూ పెరుగుతూనే ఉంది. పెరుగుతున్న రేట్లతో చికెన్ కొనలేక.. తినకుండా ఉండలేక మాంసాహార ప్రియులు సతమతం అవుతున్నారు. గత నెల చివరి వారంలో కిలో 203 రూపాయలున్న చికెన్ ధర ఈ నెలా చివరి వారానికి రూ.261కి చేరింది. అంటే 28 రోజుల్లో కిలోపై 58 రూపాయలు పెరిగింది. ఎంత తీవ్రత ఇలాగే ఉంటే మరింతగా పెరిగే అవకాశాలున్నాయని పౌల్ట్రీరంగ నిపుణులు చెబుతున్నారు. మండుతున్న ఎండలకు కోడి పిల్లలు చనిపోతాయని పౌల్ట్రీషెడ్ల నిర్వాహకులు బ్యాచ్‌లను తగ్గించారు. దీంతో ఉత్పత్తి తగ్గి చికెన్ ధర నిత్యం పెరుగుతూనే ఉంది. తీవ్ర ఎండలు, వడ గాలులకు పౌల్ట్రీల్లో కోళ్లు చనిపోతున్నాయి. ఎండల్లో షెడ్ల నిర్వాహకులు కోళ్లను పెంచడం ఆపేశారు. ఇదే సమయంలో చికెన్‌కు డిమాండ్ పెరగడంతో ధరలూ పెరిగాయి. ఎండలకు కోడి మాంసం కొనుగోళ్లు తగ్గి ధరలూ పడిపోతాయని భావిస్తే అందుకు భిన్నంగా పరిస్థితి నెలకొంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో చికెన్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఆదివారం చికెన్ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. అయితే పెరిగిన చికెన్ ధరలతో మాంసం ప్రియులు దిగులు చెందుతున్నారు. ఊహించని విధంగా పెరుగుతున్న రేటు.. గతేడాది కంటే చికెన్ ధరలు విపరీతంగా పెరిగాయి. అప్పట్లో కిలో కోడి మాంసం ధర రూ.150 నుంచి 180 వరకు ఉండేది. ఈ ఏడాది రేటు రూ.261 వరకు చేరింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా చికెన్ ధరలు పెరిగాయని వ్యాపారులు సైతం చెబుతున్నారు. సాధారణంగా కోళ్లు 40డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే తట్టుకోలేవు. షెడ్లను స్ప్రింకర్లతో నీరుపెట్టి చల్లబర్చడం, కూలర్లు వంటివి పెట్టకుంటే వేడికి చనిపోతాయి. ప్రస్తుతం 40 డ్రిగీల నుంచి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదువుతోంది. పెద్ద పెద్ద పౌల్ట్రీషెడ్ల యజమానులు కూలర్లు పెట్టో, మరో రకంగానో కోల్లను కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు.

తల్లిని రోకలి దుడ్డుతో కొట్టి చంపిన కూతురు



- ఉమ్మెడలో ఘటన

నవతెలంగాణ-ఆర్మూర్

చిన్నపాటి ఘర్షణతో కోపోద్రేకరాలైన కూతురు కన్నతల్లిని రోకలి దుడ్డుతో కొట్టగా చనిపోయిన సంఘటన నందిపేట మండలంలోని ఉమ్మెడ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. ఉమ్మెడ గ్రామానికి చెందిన నాగం నర్సు (52) కూలి పని చేసుకుంటూ జీవించేంది. ఈమె భర్త భోజన్న 20 సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఇద్దరు కూతుర్లకు పెళ్లిళ్లు చేసి గ్రామంలో ఒంటరిగా ఉంటుంది. కాగా ఇంట్లో ఒక రూమ్‌లో ఆమె మరొకదిలో ఆమె పెద్ద కూతురు నాగం హరిత ఉంటున్నారు. మతురాలి రెండవ కూతురు అరుణ ఇంట్లో తొట్లే ఫంక్షన్ జరగగా ఈ విషయమై పెద్ద కూతురు హరితకు, నర్సుకు మధ్య గొడవ జరిగింది. ఈ ఘర్షణలో హరిత తన తల్లిని రోకలితో ఇష్టం వచ్చినట్లు తలపై మొహంపై కొట్టి పారిపోయింది. ఈ విషయమై హరిత తన చెల్లెలికి, బంధువులకు ఫోన్ చేసి తెలుపగా వచ్చేసరికి నర్సు చనిపోయి ఉందని తెలిపారు. మతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

గల్ఫ్ కార్మికుల పోరాటానికి మద్దతు



నవతెలంగాణ-ఆర్మూర్

గల్ఫ్ కార్మికుల పోరాటానికి మద్దతు తెలుపుతున్నట్టు బీజేపీ నాయకుడు పొద్దుటూరి వినయ్ రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్, కొంపల్లిలో అసెంబ్లీ నియోజకవరం బీజేపీ నాయకులు గల్ఫ్ జెఏసి ప్రతినిధుల బందం కలిసి గల్ఫ్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. బొగ్గుబాయి.. బొంబాయి.. దుబాయి.. అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని అన్నారు. గల్ఫ్ జెఏసి నాయకులు గుగ్గిల్ల రవిగౌడ్, స్వదేశ్ పరికిపండ్ల, మంద భీంరెడ్డి గల్ఫ్ వలసలపై వినయ్‌రెడ్డితో చర్చించారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీలు సూచిస్తూ బీజేపీ ఎలక్షన్ మేనిఫెస్టోలో పొందుపరిచేలా అధిష్టానంతో ప్రత్యేకంగా చర్చించాలని, ఇందుకోసం చొరవ తీసుకోవాలని గల్ఫ్ జెఏసి చేసిన విజ్ఞప్తికి వినయ్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో గల్ఫ్ జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలే బలం

- ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-మోపాల్

కార్యకర్తలే బీఆర్‌ఎస్ పార్టీకి బలమని వారిని ఎల్లప్పుడూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆర్టీసీ చైర్మన్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ఆదివారం మండలంలోని దుర్గం శివారులో గల మొట్టడి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కుర్చీ కోసం కాంగ్రెస్, బిజెపిలు ప్రజలతో ఆడుకుంటారని, కేవలం తమ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల బాగుకోసమే ఆలోచిస్తాడని, కేసీఆర్ మాటిస్తే పథకం అమలు చేసి చూపుతారని అన్నారు. బిజెపి, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ఇద్దరు పొద్దున లేస్తే సీఎం కుర్చీ దిగాలి మేమే ఎక్కాలనే ఆశ తప్ప ప్రజల కోసం ఏం చేస్తామో ఇప్పటి ప్రభుత్వం కన్నా గొప్పగా ఏం చేసి చూపుతామనే చెప్పే తెలివి సత్తా లేవని అన్నారు. సీఎం కేసీఆర్ ఇవాళ ప్రజలకు ఏం చేద్దాం రేపు పథకం తెద్దాం అని ఆలోచిస్తారని అన్నారు హిందువుల పేరు చెప్పుకొని పబ్బం గడుపుతున్న బిజెపి వల్ల హిందువులకే ప్రమాదం పొంచి ఉందని ఇది ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఇక్కడ లోకల్ బిజెపి నేతలు హిందుత్వం గురించి చెబుతారని కానీ గుళ్లకు ఒక్క పైసా చందా కూడా ఇవ్వరని బాజిరెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 70 దేవాలయాలు కట్టించి ఇచ్చానని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ చొరవ వల్ల రూరల్ నియోజకవర్గనికి 750 కెవి సబ్‌స్టేషన్ వచ్చిందన్నారు. ప్రధాని మోడీ రోజుకో వేషం కడుతూ విదేశాల్లో చక్కర కొడతారని సీఎం కేసీఆర్ ప్రజల బాగు కోసం ఇక్కడ రాత్రి పగలు శ్రమిస్తారని అన్నారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా జూన్ 2 నుండి ఘనంగా 21 రోజులపాటు వేడుకలు జరుపుకోవాలని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం చేసిన సంక్షేమం అభివద్ధి గురించి అధికార యంత్రాంగంతో కలిసి పార్టీ క్యాడర్ అంతా ప్రచారం చేయాలని ప్రజలకు వివరించాలని ఆయన కోరారు యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ యాదాద్రిని చూసి ఆశ్చర్యపోయారన్నారు. కేసీఆర్ తాను చేసిన పనుల గురించి ప్రచారం చాలా తక్కువ చేసుకుంటారని ఆయన అన్నారని గుర్తు చేశారు. మంచిప్ప రిజర్వాయర్ పనులు 90శాతం పూర్తయ్యాయని ఏడాదిలో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. బిజెపి కాంగ్రెస్ పార్టీలు ఏం చేస్తాయే చెప్పరని, చేసేవారికి అడ్డుపడి ప్రజలకు మేలు జరగకుండా చేయాలని చూస్తారని అన్నారు. అన్ని మంచి పనులు చేస్తే బాజిరెడ్డి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని వారికి భయం వెంటాడుతుందని విమర్శించారు. ఇక్కడ సీఎం కేసీఆర్ మదిలో పథకం రూపుదిద్దుకుంటే దాని అమలు చేయడం ఆయన చేతుల్లో ఉంటుందని, కానీ బిజెపి కాంగ్రెస్ పార్టీలు ఇచ్చే హామీలు నెరవేరాలంటే ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షణ చేసి వారి మెప్పు పొంది అప్పుడు అమలయ్యే పరిస్థితి ఉంటుందని అన్నారు. ఈ సమావేశానికి మోపాల్ మండల్ పార్టీ అధ్యక్షుడు మొచ్చ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. మహా సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించినందున జెడ్పిటిసి నరేష్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో. నుడా డైరెక్టర్ అభిలాష్ రెడ్డి, బోర్గం సొసైటీ చైర్మన్, ఎన్‌డిసిసీబి బ్యాంక్ డైరెక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి, ఎంపీపీ లతా కన్నీరాం, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మోపాల్ మండల్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు, మంచిప్ప సర్పంచ్ ఇందూరు సిద్ధార్థ, సిర్పూర్ సర్పంచ్ ముత్యం రెడ్డి మోపాల్ సర్పంచ్ రవి, తనకుర్తు సర్పంచ్ లతా భూషణ్, మోపాల్ సొసైటీ చైర్మన్ ఉమాపతిరావు, ఎంపీటీసీలు, సొసైటీ డైరెక్టర్లు, గ్రామ కమిటీ బారాస పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ధరల నిర్ణయాక కమిషన్‌ను రద్దుచేయాలి

- తెలంగాణ పథకాలపై జరిగిన సమావేశంలో రైతు సంఘాలు



మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

తమిళనాడులోని దిండిగల్‌లో అఖిల భారత రైతు సంఘాల సమావేశంలో తెలంగాణ పథకాలపై జరిగిన చర్చ కార్యక్రమాల్లో పాల్గొన్నట్టు దక్షిణ భారత రైతు సంఘాల సమైక్య అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. వివిధ సమస్యలపై చర్చించి దేశ రైతుల జీవితంలో గుణాత్మక మార్పుకోసం కేంద్రం ప్రభుత్వం ఎంఎస్‌పి చట్టాన్ని అమలుకు ప్రస్తుతం ఉన్న ధరల నిర్ణయాక కమిషన్ చేస్తున్న ధరలు రైతులకు న్యాయం జరగటం లేదని అన్నారు. కనుక ధరల నిర్ణయాక కమిషన్‌ను రద్దుచేసి దాని స్థానంలో ట్రిబ్యునల్ ను ఏర్పాటు చేయాలని అంతర్జాతీయ స్థానంలో డిమాండ్ ఉన్నప్పుడు ఎగుమతులను బ్యాన్ చేయడాన్నివ్యతిరేకిస్తూ తీర్మానించినట్టు తెలిపారు.

తెలంగాణ పథకాలపై ప్రత్యేక చర్చ..

ప్రస్తుతం దేశంలో రైతులకు మౌలిక సదుపాయాలు, విద్యుత్, తాగునీరు, పెట్టుబడి సాయం జీవిత బీమా కల్పన తదితర పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తూ ఇతర రాష్ట్రాలలో కూడా అమలు చేయాలని రైతు నాయకులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఎంఎస్‌పీని సమర్ధవంతంగా అమలు చేయడానికి దేశానికి తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తుందని అభివర్ణించారు. సమావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన రైతు ప్రతినిధులు పాల్గొన్నారు

తెలుగు జాతి కీర్తిని ఉన్నత స్థితిలో నిలబెట్టిన మహనీయుడు ఎన్టీఆర్

- రెండు తెలుగు రాష్ట్రాలలో రాజకీయాలు పూర్తిగా దిగజారిపోయాయి
- మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న మండవ వెంకటేశ్వర్‌రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలుగు జాతి కీర్తిని ఉన్నత స్థితిలో నిలబెట్టిన మహనీయుడు తెలుగు జాతి ముద్దుబిడ్డ నందమూరి తారక రామారావు అని మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు కొనియాడారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు స్వగ్రామం డిచ్ పల్లి మండలం లోని ధర్మారం(బీ)లో ఆదివారం ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అభిమానులు మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగ మండవ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు వారి గొంతును ఢిల్లీ పీఠం వరకు వినిపించేలా పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారంలో నిలిపి తనదైన ముద్రను వేసి, విలువలు ఉన్న రాజకీయ నాయకుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని అన్నారు. నేడు ఆ యుగపురుషుని శతజయంతి వేడుకలు తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఎన్టీఆర్ చేసిన సేవలు చిరకాలం చరిత్రలో నిలిచిపోతాయని వివరించారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో రాజకీయాలు పూర్తిగా దిగజారిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నాం

ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా అత్యాధునిక వైద్య సదుపాయాలు

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- సిటీ స్కానింగ్ సెంటర్, కాటరాక్ట్ ఆపరేషన్ లేజర్ మెషిన్, మానసిక వికలాంగుల ప్రత్యేక విభాగం ప్రారంభించిన మంత్రి



ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి వేముల

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కానింగ్ సెంటర్, కంటి కాటరాక్ట్ ఆపరేషన్ లేజర్ మెషిన్, మానసిక వికలాంగుల ప్రత్యేక విభాగం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే గణేష్ గుప్తా, జెడ్పీ ఛైర్మెన్ విఠల్ రావు, ఉమెన్ డెవలప్మెంట్ కోఆపరేటివ్ చైర్ పర్సన్ ఆకుల లలిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ దవాఖానాలను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఖరీదైన సిటీ స్కానింగ్ ను ప్రారంభించడం సంతోషకరమని, 14 లక్షల వ్యయంతో కాటరాక్ కంటి మిషన్లు కూడా ప్రారంభించామని తెలిపారు. మానసిక వికలాంగుల చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించామని చెప్పారు. మానవీయ కోణంలో ఏర్పాటు చేసిన మానసిక వికలాంగుల విభాగం 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. డిజిటల్ బిపి మిషన్‌లను జిల్లాలోని అన్ని పీహెచ్ సి లకు పంపిణీ చేసామని చెప్పారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా నిరుపేదలకు అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

మిత్రునికి ఆర్థిక చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్నమిత్రులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన లాండేరి రాజేందర్ కు తన తోటి పదవ తరగతి 1995-96 బ్యాచ్ మిత్రులు రూ.27వేల ఆర్థిక సహాయం అందజేశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజేందర్‌కు ఆర్థిక చేయూత అందించేందుకు తోటి మిత్రులు తోచిన విధంగా రూ. 27వేలు పోగు చేశారు.

ఆ డబ్బులను ఆదివారం రాజేందర్ ఇంటికి వెళ్లి పరామర్శించి అందజేశారు. కార్యక్రమంలో బద్దం రాజశేఖర్, సుంకేట శ్రీనివాస్, నరసయ్య, నవత్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు

జిల్లా స్థాయి సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న యువకులు

నవతెలంగాణ-ముప్కాల్

రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ముప్కాల్ క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి సర్కిల్ క్రికెట్ టోర్న మెంట్‌ను ఆదివారం తోటి నాయకులతో కలిసి బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి ఆదిఆ వ రం ప్రపారంభించారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలుగా నిర్ణయించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యాక్షులు కె.గంగాధర్, గ్రామాభివద్ధి కమిటీ అధ్యక్షులు ఎర్రోళ్ల విజయ్, గద్దల గంగారాం, శ్రీనివాస్ గౌడ్, క్రీడాకారులు ప్రశాంత్, శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు..

పట్టణానికి ఆదర్శం జర్నలిస్టు కాలనీ

- మున్సిపల్ చైర్పర్సన్ పండిత్ వినీత పవన్

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహిస్తూ కాలనీని పరిశుభ్రంగా ఉంచుకుంటూ జర్నలిస్ట్ కాలనీవాసులు ఆర్మూర్‌కు ఆదర్శంగా నిలుస్తున్నారని పురపాలక చైర్ పర్సన్ పండిత్ వినీత ప్రశంసించారు. జర్నలిస్ట్ కాలనీలో ఆదివారం అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. కాలనీవాసులతో కలిసి ఆమె ఉద్యానవనంలో పిచ్చిమొక్కలను తొలగించారు. కాలనీవాసులు శ్రమదానంతో శుభ్రం చేసిన మురుగు కాలువలను ఆమె పరిశీలించారు. అభివద్ధి కమిటీ అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాలనీవాసులను చైర్ పర్సన్ అభినందించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అందరం ఆరోగ్యంగా ఉంటామని పేర్కొన్నారు. ప్రతివారం శ్రమదానం ప్రశంసనీయమని, అన్ని కాలనీలు జర్నలిస్ట్ కాలనీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాలనీలో మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. తాము కోరిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసిన చైర్ పర్సన్ పండిత్ వినీతకు, సహకరించిన స్థానిక కౌన్సిలర్ వనం శేఖర్ కు జర్నలిస్ట్ కాలనీ అభివద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ కతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్ వనం శేఖర్, కాలనీ అభివద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులంతా కలిసి రోడ్ల పక్కనున్న ముళ్ళ పొదలను, పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని తొలగించారు. మురుగు కాలువలు శుభ్రం చేశారు. స్థానికులకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు.

జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకే శ్రీనివాస్, కార్యదర్శులు కె.రాజు, కొండి పవన్, ఎల్.సాయన్న, కాలనీ పెద్దలు ఎస్.గణపతి, ఎల్టీ కుమార్, భూమయ్య, విశ్రాంత విద్యాధికారి లక్ష్మయ్య, నరహరి, సీహెచ్. విద్యాసాగర్, జార్జి, రాము, నల్ల సాయన్న, బిక్షపతి, భాజన్నతదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-మోర్తాడ్

మోర్తాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించుకున్నారు. 1972- 73 సంవత్సరానికి చెందిన ఎస్‌ఎస్‌సీ విద్యార్థులు 50 సంవత్సరాల సందర్భంగా తమ కలయిక ఎంతో మధురానుభూతిని కలిగిస్తుందని అన్నారు. నాటి గురువులతో పూర్వ విద్యార్థులు కలిసి నాటి నుండి నేటి వరకు జీవిత మధురానుభూతులను మననం చేసుకున్నారు. సర్పంచ్ ధరణి మాట్లాడుతూ 50 సంవత్సరాల అనంతరం సైతం స్నేహితులందరూ కలిసి గురువర్యులను సన్మానించడం విద్యార్థులు అందరూ ఒకే చోట సమావేశం ఏర్పాటు చేసుకోవడం ఎంతో గర్వకారణం అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నిర్దేశించి మాట్లాడిన గురువువర్యులు తమను గుర్తుంచుకొని ఆహ్వానించడం చాలా గర్వంగా ఉందని అన్నారు. ప్రస్తుతం ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకుంటున్న ప్రతి ఒక్కరు వద్ధాప్య దశకు చేరుకున్న సమయంలో వారి తల్లిదండ్రులను, పిల్లలతో కలిసి సుఖశాంతులతో ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలలో తమ వంతు పాత్ర పాలుపంచుకొని ప్రజలలో మంచి గుర్తింపు పొందాలని అన్నారు. పలువురు పూర్వ విద్యార్థులు గురువులను సన్మానిస్తూ వారి చిన్ననాటి విషయాలను ఉపాధ్యాయులతో గుర్తుచేకున్నారు.